# కొత్త తరానికి 'సోమసుందర్ సాహిత్యం'

**గాంధీనగర్, న్యూస్‌టుడే:** ఆవంత్స సోమసుందర్ సాహిత్య కృషిని కొత్త తరాలకు పరిచయం చేయడానికి శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సాహిత్య అకాడమీ తెలుగు విభాగం కన్వీనర్ సి.మృణాళిని పేర్కొన్నారు. సాహిత్య అకాడమీ, క్రియ సొసైటీల సంయుక్త ఆధ్వర్యంలో వజ్రాయుధ కవి ఆవంత్స సోమసుందర్ శత జయంత్యుత్సవ వేడుక శనివారం గాంధీభవన్‌లో నిర్వహించారు. మృణాళిని మాట్లాడుతూ సోమసుందర్ 100కు పైగా పుస్తకాలు రాశారన్నారు. కవిత్వం, కథ, విమర్శ, వ్యాసాలు, మోనోగ్రాఫ్ వంటి ప్రక్రియల్లో విశేష కృషి చేశారన్నారు. ముఖ్య అతిథి చందు సుబ్బారావు మాట్లాడుతూ ఆయనకు వాస్తవికతపై గౌరవం ఎక్కువన్నారు. తన రచనలతో యువతను ప్రేరేపించారన్నారు. ప్రముఖ తెలుగు కవి నందిని సిదారెడ్డి మాట్లాడుతూ నిజాం పాలకులను ఎదిరిస్తూ సోమసుందర్ వెలువరించిన గేయకావ్యం వజ్రాయుధం నాటి తెలంగాణ పరిస్థితులను కళ్లకు కట్టిందన్నారు. క్రియ సొసైటీ కార్యదర్శి జగన్నాథరావు మాట్లాడారు. సోమసుందర్ దీర్ఘ కవితలపై ఎన్.ఈశ్వరరెడ్డి, ఆయన ఆత్మకథపై వాడ్రేవు వీరలక్ష్మీదేవి ప్రసంగించారు. ఆయన రచనలపై ఉషాకుమారి, సీతారామస్వామి, బొల్లోజుబాబా, మురళీశంకర్, నండూరి రాజగోపాల్, ఆర్.సీతారామస్వామి, మేకా మన్మధరావు, కె.సంజీవరావు(శిఖామణి)లు మాట్లాడారు. ఉమ్మడి జిల్లాకు చెందిన సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.



కీలకోపన్యాసం చేస్తున్న సిదారెడ్డి